# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఫెయింజల్ తుఫాను ప్రభావిత జిల్లాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని హెూం శాఖ మంత్రి వి. అనిత ఆదేశాలు జారీచేశారు.
2. ధరల స్థిరీకరణపై రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఈ రోజు సమావేశమైంది.
3. ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందించే నిత్యావసర వస్తువులు ప్రజలకు సక్రమంగా సరఫరా చేయాలని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
4. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేలా ఈరోజు నుంచి "సంకల్ప్ కార్యక్రమం" నిర్వహిస్తునట్లు విద్యాశాఖ తెలిపింది.
5. దేశవ్యాప్తంగా గత అక్టోబర్ నెలలో యూపీఐ వ్యవస్థ ద్వారా 16 వందల 58 కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు జరిగాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

==========================

ఫెయింజల్ తుఫాను ప్రభావిత జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పకప్పుడు ముందస్తు చర్యలు చేపట్టాలని హోం శాఖ మంత్రి వి. అనిత ఆదేశాలు జారీచేశారు. తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో హోంమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాల్లో తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో తిరుపతి జిల్లాలో స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోందని, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నందున ఆయా పరిసరాలలోని ప్రజలను అప్రమత్తం చేయాలని, జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు.

--------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెయింజల్ తుపాను వల్ల భారీ వర్షాలు కురవడంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సోమశిల కండలేరు .. జలాశయాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. జిల్లాలో వర్షం ప్రభావంపై శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆకాశవాణి ప్రతినిధి ఎస్ అమరనారాయణ మరిన్ని వివరాలు అందిస్తారు.

వాయిస్ (33 సెకన్లు)

--------------------------

ధరల స్థిరీకరణపై రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఈ రోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిత్యావసర ధరల పర్యవేక్షణపై మంత్రుల కమిటీ సమావేశమైంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రస్తుత మార్కెట్‌లో నిత్యావసరాల ధరల నియంత్రణ అంశంపై మంత్రివర్గ ఉపసంఘం చర్చిస్తోందని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందించే నిత్యవసర సరుకులు ప్రజలకు సక్రమంగా సరఫరా చేయాలని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం మాధవరం కస్బాలో నూతన రేషన్ దుకాణాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నాణ్యమైన నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తోందని, రేషన్ డీలర్లు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో రేషన్ సరఫరా చేయాలని తెలిపారు. పంపిణీలో అవకతవకలకు పాల్పడిన డీలర్లపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

---------------------------

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి ప్రస్తుతం ఆయా జిల్లాల్లోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు ఏ ఇబ్బందీ కలగకుండా.. తుపాను తగ్గే వరకు అధికారులంతా అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటుగా ఉత్తీర్ణత శాతం పెంచేలా ఈ రోజు నుంచి “సంకల్ప్ కార్యక్రమం” నిర్వహిస్తునట్లు విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి 28వ తేదీ వరకు జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వారి విద్యా నైపుణ్యాలను బట్టి చదువుపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే కళాశాల సమయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆ రోజు చెప్పే పాఠాలను చదివించడంతో పాటు పరీక్షలకు సన్నద్ధం చేసేలా ప్రణాళికను రూపొందించి శిక్షణ ఇచ్చేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ప్రరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటి నుంచి పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు

ఏర్పాటు చేసే వారికి చేయూత నిచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (29 సెకన్లు)

---------------------------

దేశవ్యాప్తంగా గత అక్టోబర్ నెలలో ఏకీకృత చెల్లింపుల ఇంటర్‌ఫేస్ – యూపీఐ వ్యవస్థ ద్వారా 16 వందల 58 కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. గత ఏడాది అక్టోబర్ నెలతో పోలిస్తే ఇది 45 శాతం అధికంగా ఉందని పేర్కొంది. యూపీఐని 2016లో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసింది. ఈ విధానంలో వివిధ బ్యాంకుల అకౌంట్ల ఖాతాలను మొబైల్ అప్లికేషన్ ద్వారా చెల్లింపులు జరుపవచ్చు. యూపీఐ ద్వారా లావాదేవీలు జరపడమే కాకుండా వ్యక్తులు, చిరు వ్యాపారులు వ్యాపారస్తులు తమ ఆర్థిక కార్యకలాపాల్లో నగదు రహిత చెల్లింపులను చేయవచ్చు.

---------------------------

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలులోని మున్సిపల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలను కలెక్టర్ ఈరోజు ప్రారంభించారు. విభిన్న ప్రతిభావంతులు వివిధ క్రీడా వేదికలపై తమ ప్రతిభను చాటుతున్నారని ఆమె తెలియజేస్తూ..

వాయిస్ ( 25 సెకన్లు)

---------------------------

దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ క్రీడలు, వ్యాయామాన్ని భాగంగా చేసుకోవాలని వైయస్సార్ జిల్లా అదనపు ఎస్పీ కె.ప్రకాష్ బాబు తెలిపారు. కడప నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీస్ వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, క్రీడాస్ఫూర్తిని నింపేలా ఎక్కువమంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వం కోసం వ్యాయామాన్ని, క్రీడలను అలవాటుగా చేసుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని తిరుపతి విమానాశ్రయం నుంచి ముంబైకి నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించినట్లు తిరుపతి విమానాశ్రయ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విమానం తిరుపతి నుండి ఉదయం 7 గంటల 45 నిమిషాలకు బయలుదేరి ముంబైకి 9 గంటల 25 నిమిషాలకు చేరుకుంటుందని, విమాన సర్వీసు వారానికి ఏడు రోజులు అందుబాటులో ఉంటుందని అన్నారు. తిరుపతి మరో మెట్రో నగరంతో అనుసంధానమైందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

=====================